ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక




## 5 నిముషాల ముందు కూడా రిజర్వేషన్

### రైల్వే శాఖ తాజా సమాచారం

న్యూఢిల్లీ, మే 25 (ప్రభాత ఉదయం): కొన్ని గంటల ముందు ప్రయాణం నిర్ణయమైన వారికి ఐదు నిమిషాల ముందు ట్రైన్ టికెట్ బుక్ చేసుకునే వెసులు బాటు రైల్వేశాఖ కల్పించింది. అంతవరకు బుక్ అయిన టికెట్లలో ఖాళీ ఉంటే రైలు బయల్దేరడానికి ఐదు నిమిషాల ముందు కూడా టికెట్ బుక్ చేసుకోవచ్చని చెబుతోంది. అనేక ..మిగతా 2లో

సంపుటి: 2 | సంచిక: 46 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 26 మే 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## తెలంగాణలో మళ్లీ పెరిగిన ఎండలు

### ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకుపైగా నమోదు
### వర్షాలు తగ్గుముఖంతో మారిన వాతావరణం

హైదరాబాద్, మే 25 (ప్రభాత ఉదయం): తెలంగాణలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పాటు..ఎండలు దంచి కొడుతున్నాయి. మళ్లీ ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. ఈ క్రమంలో రాబోయే ఐదురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. శనివారం ఉరుములు, మెరుపులు, ..మిగతా 2లో

## తెలంగాణలో డ్రగ్స్ అనే మాట
# వినపడొద్దు

### తొలి సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మే 25 (ప్రభాత ఉదయం): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతోంది. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రాన్ని చేయాలని భావించి ప్రత్యేక చర్యలు చేపట్టింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్కు రేవంత్ రెడ్డి చేరుకున్నారు. సీఎం హోదాలో తొలిసారి రేవంత్ రెడ్డి అక్కడికి వెళ్లారు. కమాండ్ కంట్రోల్లో ఉండే అధికారులు విధులు, ఇతర అంశాలపై సమీక్షిస్తున్నట్లు తెలుస్తోంది. నార్కోటిక్స్ బ్యూరో పనితీరుపై ఆరా తీసిన సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణలో డ్రగ్స్ అనే పదం వినిపించకూడదు అని ఆదేశించారు. డ్రగ్స్ను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే యువతపై డ్రగ్స్, మత్తు పదార్థాలు తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. నార్కోటిక్స్ బ్యూరోకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించింది. డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపాలని ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఇదివరకే ఆదేశించారు. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షిస్తున్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలు అరికట్టడంతో పాటు అవి ఎక్కడి నుంచి వస్తున్నాయో గుర్తించి చర్యలు తీసుకోవడంపై చర్చించారు. ఇటీవల బెంగళూరు శివారులో జరిగిన రేవ్ పార్టీ తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపింది. టాలీవుడ్ సెలబ్రిటీలు, వ్యాపారవేత్తలు, రాజకీయ నేతలు ఆ పార్టీలో డ్రగ్స్ వినియోగించారని బెంగళూరు పోలీసులు ప్రకటించడంతో ఈ సమీక్షపై ఉత్కంఠ నెలకొంది.






## గుజరాత్‌లో గేమ్ జోన్‌లో
## భారీ అగ్నిప్రమాదం

### 22 మంది సజీవ దహనం

రాజ్కోట్: మే 25 (ప్రభాత ఉదయం): గుజరాత్లో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. రాజ్కోట్ లోని టీఆర్పీ గేమ్ జోన్లో శనివారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో దట్టమైన పొగ ఆవరించి ఊపిరాడక భారీగా ప్రాణ నష్టం సంభవించింది. ఇప్పటివరకూ చిన్నారులు, మహిళలు సహా 22 మంది చనిపోయారని అధికారులు తెలిపారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అగ్నిప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చారు. ఈ అగ్నిప్రమాదం ఘటనపై రాజ్కోట్ పోలీస్ కమిషనర్ రాజు భార్గవ స్పందించారు. శనివారం మధ్యాహ్నం టీఆర్పీ గేమింగ్ జోన్లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు చెలరేగి, తక్కువ సమయంలోనే గేమింగ్ జోన్ మొత్తం ..మిగతా 2లో

## తెలంగాణలో పాఠశాలల
# అకడమిక్ క్యాలెండర్ విడుదల

### దసరా, సంక్రాంతి సెలవుల వివరాలు ఇలా



హైదరాబాద్, మే 25 (ప్రభాత ఉదయం): తెలంగాణలోని పాఠశాలలకు సంబంధించిన 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన అకడమిక్ క్యాలెండర్ను ప్రభుత్వం మే 25న విడుదల చేసింది. దీని ప్రకారం కొత్త విద్యాసంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభంకానుంది. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతులకు కొత్త అకడమిక్ క్యాలెండర్ వర్తించనుంది. ఉన్నత పాఠశాలలు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు, అప్పర్ ప్రైమరీ స్కూల్స్ ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు కొనసాగనున్నాయి. ఈ విద్యాసంవత్సరంలో మొత్తం 229 రోజులు స్కూళ్లు పని చేయనున్నాయి. స్కూళ్లు జూన్ 12న ప్రారంభమై.. ఏప్రిల్ 24న ముగియనున్నాయి. ఈ మేరకు పరీక్షల క్యాలెండర్కు సంబంధించి ప్రాజెక్ట్ డైరెక్టర్కు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్కు, ..మిగతా 2లో



## దేశవ్యాప్తంగా ముగిసిన
# 6వ దశ పోలింగ్

### ఏడో దశపై నేతల ప్రత్యేక దృష్టి

న్యూఢిల్లీ, మే 25 (ప్రభాత ఉదయం): లోక్‌సభ ఎన్నికల్లో ఆరో దశ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం ఐదు గంటల వరకు 58 శాతం పోలింగ్ నమోదయినట్లు తెలిపారు ఎన్నికల అధికారులు. దేశవ్యాప్తంగా ఈ దశలో 58 స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. దేశరాజధాని ఢిల్లీలో సాయంత్రం 5 గంటల వరకు 54 శాతం పోలింగ్ నమోదయ్యింది. 2019 ఎన్నికల్లో ఢిల్లీలో 60 శాతానికిపైగా పోలింగ్ నమోదు కాగా ఈసారి తగ్గే అవకాశం కన్పిస్తోంది. ఢిల్లీలో ఎండ తీవ్రత కారణంగా ఓటింగ్ శాతం తగ్గినట్టు అధికారులు చెబుతున్నారు. బెంగాల్‌లో మాత్రం ఈసారి కూడా పెద్ద ఎత్తున పోలింగ్ శాతం నమోదయ్యింది. సాయంత్రం 5 గంటల వరకు 78 శాతం పోలింగ్ నమోదయ్యిందని తెలిపారు ఎన్నికల అధికారులు. అయితే పోలింగ్ సందర్భంగా పలు చోట్లు టీఎంసీ, బీజేపీ కార్యకర్తలకు మధ్య వాగ్వాదంతోపాటు ఘర్షణ వాతావరణం చెలరేగింది. వీటిని పోలీసులు సర్ధుమణిగించే ప్రయత్నం చేశారు. ఎక్కడా హింసాత్మక ఘటనలు చోటు చేసుకోలేదు. అలాగే ఉత్తరప్రదేశ్‌లో సాయంత్రం 5 గంటల వరకు కేవలం 52 శాతం పోలింగ్ నమోదు కావడం ఈసీ అధికారులను నిరాశపర్చింది. ఇక ఈరోజు జరిగిన పోలింగ్‌తో మొత్తం 543 లోక్‌సభ స్థానాల్లో 486 స్థానాల్లో ఎన్నికలు పూర్తవుతాయి. హర్యానా, ఢిల్లీ, జమ్మూ కాశ్మీర్‌లలో కూడా నేటితో పోలింగ్ పూర్తవుతుంది. ఏడు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీహార్, బెంగాల్‌లో ఎనిమిది పార్లమెంట్ స్థానాలకు పోలింగ్ ప్రక్రియ జరిగింది. అలాగే ఢిల్లీలో ఏడు, హర్యానాలో 10, జారండ్‌లో నాలుగు, ఉత్తరప్రదేశ్‌లో 14 స్థానాల్లో పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 6 గంటకు ముగిసింది. జమ్మూ - కాశ్మీర్‌లోని చివరి పార్లమెంట్ స్థానంతోపాటు అనంత్‌నాగ్-రాజౌరిలో పోలింగ్‌ను మూడో దశ నుంచి ఆరో దశకు మార్చడంతో ఇక్కడ కూడా సజావుగా పోలింగ్ ..మిగతా 2లో

## తెలంగాణ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు
# ముగిసిన ప్రచారం

### సోమవారం పోలింగ్



హైదరాబాద్, మే 25 (ప్రభాత ఉదయం): ఖమ్మం - వరంగల్ - నల్లగొండ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారం శనివారం సాయంత్రం ముగిసింది. ఉప ఎన్నిక కోసం ఎన్నికల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 27న పోలింగ్ జరుగుతుంది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది. జూన్ 5వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో పోలింగ్ జరగనుండటంతో.. ఆయా జిల్లాల ఉద్యోగులకు సెలవు మంజూరు చేశారు.

#### 34 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఓటింగ్

మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోన 34 అసెంబ్లీ నియోజకవర్గాలల్లో మొత్తం 4 లక్షల 61 వేల 806 గ్రాడ్యుయేట్లు ఓటు వేయనున్నారు. అత్యధికంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో లక్షా 73వేల 406 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. ఇక, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షా 23వేల 985 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా.. ఉమ్మడి నల్గొండ జిల్లాలో లక్షా 66వేల 448 మంది గ్రాడ్యుయేట్ ..మిగతా 2లో



## ఉద్యోగాలిచ్చింది కేసీఆర్

### భర్తీ చేశామని రేవంత్ చెప్పుకుంటున్నారు

#### కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, మే 25 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. 32 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని రేవంత్ చెప్పుకుంటున్నారని అవన్నీ కేసీఆర్ సర్కార్ భర్తీ చేసినవేనని స్పష్టం చేశారు. తెలంగాణ భవన్ లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని చెబుతున్న 32 వేల ఉద్యోగాల భర్తీకి సంబంధించిన వివరాలను కేటీఆర్ వెల్లడించారు. ఈ ఉద్యోగాలకు రేవంత్ కేవలం నియామక పత్రాలు మాత్రమే అందజేసినట్లు కేటీఆర్ ..మిగతా 2లో

# తెలంగాణలో పాఠశాలల అకడమిక్ క్యాలెండర్ విడుదల

**మొదటి పేజీ తరువాయి...**



మోడల్ స్కూళ్ల డైరెక్టర్కు, ప్రభుత్వ ఎగ్జామినేషన్స్ డైరెక్టర్కు, ఎస్ఐఈటీ డైరెక్టర్కు, గురుకుల విద్యాలయాల డైరెక్టర్కు, హైదరాబాద్, వరంగల్ రీజినల్ జాయింట్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లకు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషన్ అధికారులకు.. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాలు జారీచేశారు. ఈ అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం.. ఈ ఏడాది జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ 23 వరకు పాఠశాలలు కొనసాగనున్నాయి. 2025 ఫిబ్రవరి 28 లోపు పదోతరగతి ప్రి-ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. 2025 మార్చిలో పదోతరగతి వార్షిక పరీక్షలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 2 నుంచి 14 వరకు దసరా సెలవులు, డిసెంబర్ 23 నుంచి 27 వరకు క్రిస్మస్ సెలవులు, జనవరి 13 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు.

### 2024-25 అకడమిక్ క్యాలెండర్ ప్రకారం...

ఈ ఏడాది జూన్ 12న పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. 2025 ఏప్రిల్ 23తో విద్యాసంవత్సరం ముగియనుంది.

ఈ విద్యాసంవత్సరంలో మొత్తం 229 రోజులపాటు పాఠశాలలు పనిచేయనున్నాయి.

2025 ఏప్రిల్ 24 నుంచి 2025 జూన్ 11 వరకు 49 రోజులపాటు వేసవి సెలవులు ఇవ్వనున్నారు.

2025 జనవరి 10న పదో తరగతి సిలబస్ పూర్తిచేసి, పబ్లిక్ పరీక్షలలోపు రివిజన్ క్లాసులు, ప్రీ ఫైనల్ పరీక్షలు పూర్తిచేయనున్నారు.

ఇక 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు సిలబస్ను 2025 ఫిబ్రవరి 28 లోపు పూర్తిచేసి, 2025 ఏప్రిల్లో నిర్వహించే ఎస్ఏ-2 పరీక్ష కోసం రివిజన్, రెమెడియల్ టీచింగ్, ప్రిపరేషన్ నిర్వహించనున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రార్థన అనంతరం అన్ని తరగతుల్లో 5 నిమిషాలపాటు యోగా, ధ్యానం తరగతులు ఉండనున్నాయి.

ఈ ఏడాది దసరా సెలవులు అక్టోబర్ 2 నుంచి 14 వరకు 13 రోజుల పాటు ఉండనున్నాయి. ఇక సంక్రాంతి సెలవులు 2025 జనవరి 13 నుంచి 17 వరకు మొత్తం 5 రోజులు ఉంటాయని వెల్లడించింది. ఇక డిసెంబర్ 23 నుంచి 27 వరకు క్రిస్మస్ సెలవులు ఇవ్వనున్నారు.

### పరీక్షల షెడ్యూలు ఇలా..

ఫార్మాటివ్ అసెస్మెంట్-1 పరీక్షలను ఈ ఏడాది జులై 31 నాటికి నిర్వహించనున్నారు.

ఫార్మాటివ్ అసెస్మెంట్-2 పరీక్షలను ఈ ఏడాది సెప్టెంబర్ 30 నాటికి నిర్వహించనున్నారు.

సమ్మేటివ్ అసెస్మెంట్ -1 పరీక్షలను ఈ ఏడాది అక్టోబర్ 21 నుంచి 28 వరకు, ఫార్మాటివ్ అసెస్మెంట్-3 పరీక్షలను ఏడాది డిసెంబర్ 12 లోపు, ఫార్మాటివ్ అసెస్మెంట్-4 పరీక్షలను 2025 జనవరి 29 లోపు పూర్తిచేయనున్నారు.

సమ్మేటివ్ అసెస్మెంట్-2 పరీక్షలను 2024 ఏప్రిల్ 9 నుంచి 2024 ఏప్రిల్ 29 వరకు (1 నుంచి 9 తరగతులకు), ప్రీ ఫైనల్ (10వ తరగతి) పరీక్షలను 2024 ఫిబ్రవరి 28లోపు నిర్వహించనున్నారు.

ఇక పదోతరగతి వార్షిక పరీక్షలను 2025 మార్చి నెలలో నిర్వహించనున్నట్లు పరీక్షల షెడ్యూల్లో పేర్కొన్నారు.

### 2024 ఏడాదిలో తెలంగాణలో సాధారణ సెలవులు ఇలా..

2024కి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం సెలవుల లిస్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. 2024 ఏడాదిలో సాధారణ సెలవులు 27 కాగా, ఆప్షనల్ హాలీడేస్ 25 ఉన్నాయి.

జనవరి 15న సంక్రాంతి సెలవు, మార్చి 8న మహాశివరాత్రి, మార్చి 25న హెూలీ, ఏప్రిల్ 9న ఉగాది, ఏప్రిల్ 17న శ్రీరామనవమి, జూన్ 17న బక్రీద్, సెప్టెంబర్ 7న వినాయక చవితి, అక్టోబర్ 10న దసరా, అక్టోబర్ 31న దీపావళికి సెలవులు ప్రకటించారు.




# ఉద్యోగాలిచ్చింది కేసీఆర్

**మొదటి పేజీ తరువాయి...**

స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి 30 వేల ఉద్యోగాలు ఇచ్చానని రేవంత్ రెడ్డి, మంత్రులు అదే పనిగా ప్రచారం చేసుకుంటున్నారని మీరు 30 వేల ఉద్యోగాలు ఇచ్చిన మాట వాస్తవం అయితే ఏ తేదీన నోటిఫికేసన్ ఇచ్చారు. రాతపరీక్ష ఎప్పుడు నిర్వహించారు. ఫలితాలు ఎప్పుడు ఇచ్చారో తెలంగాణ నిరుద్యోగులకు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. వారు చెప్పలేరని ఎందుకంటే అవన్నీ కేసీఆర్ హయాలో వచ్చినవేనన్నారు. ఉద్యోగాల భర్తీ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ఇష్టమొచ్చినట్టు అబద్దాలు చెబుతున్నారని తేల్చారు. గురుకులాల్లో 9,210 టీజీటీ, పీజీటీ పోస్టుల భర్తీకి ఏప్రిల్ 2023లో నోటిఫికేషన్ ఇచ్చారు. ఆగస్టు 2023లో రాతపరీక్షలు నిర్వహించారు. ఫలితాలు మాత్రం ఫిబ్రవరి 2024లో విడుదలయ్యాయన్నారు. పోలీసు శాఖలో 17,516 ఉద్యోగాలకు ఏప్రిల్ 2022లో నోటిఫికేషన్ ఇచ్చాం. జూన్ 2023లో రాతపరీక్షలు నిర్వహించాం. అక్టోబర్ 4, 2023లో ఫలితాలు వచ్చాయి. ఎన్నికల కోడ్ రావడంతో భర్తీ ప్రక్రియ ఆగిపోయింది. పోలీసు ఉద్యోగాల భర్తీ కేసీఆర్ హయాంలోనే జరిగింది. రేవంత్ రెడ్డి నియామక పత్రాలు మాత్రమే ఇచ్చారన్నారు. 5,204 స్టాఫ్ నర్సు ఉద్యోగాల భర్తీకి డిసెంబర్ 2022లో నోటిఫికేషన్ జారీ చేసి, ఆగస్టు 2, 2023న రాతపరీక్ష నిర్వహించాం. డిసెంబర్ 23, 2023న ఫలితాలు ప్రకటించామన్నారు. 587 ఎస్ఐ, ఏఎస్ఐ పోస్టులకు ఏప్రిల్ 2022లో నోటిఫికేషన్ జారీ అయిందని ఏప్రిల్ 2023లో రాతపరీక్ష నిర్వహించామని కేటీఆర్ తెలిపారు. ఆగస్టు 7 2023లో ఫలితాలు ప్రకటించాం. కానీ న్యాయపరమైన చిక్కుల వల్ల నియామక పత్రాలు ఇవ్వలేకపోయాం. పైన పేర్కొన్న ఉద్యోగాలకు రేవంత్ కేవలం నియామక పత్రాలు మాత్రమే ఇచ్చారు. 32 వేల ఉద్యోగాలు భర్తీ చేసింది మాత్రం కేసీఆర్ అని కేటీఆర్ స్పష్టం చేశారు. తొమ్మిదిన్నరేండ్ల కాలంలో 1.60 లక్షల ఉద్యోగాలు పూర్తిస్థాయిలో భర్తీ చేయగా, 32 వేల ఉద్యోగాలు కొన్ని కారణాల వల్ల ఆగిపోయాయి. ఇవి అవి మొత్తం కలుపుకుంటే కేసీఆర్ భర్తీ చేసిన ఉద్యోగాలు ఒక లక్షా 92 వేలని లెక్క చెప్పారు. గ్రాడ్యూయేట్ ఎమ్మెల్సి ఎన్నికల పోలింగ్ సందర్భంగా కాంగ్రెస్ నేతలు తాము ఉద్యోగాలిచ్చామని ప్రచారం చేసుకుంటూండటంతో కేటీఆర్ ఈ వివరాలు వెల్లడించారు.



# గుజరాత్‌లో గేమ్ జోన్‌లో భారీ అగ్నిప్రమాదం

**మొదటి పేజీ తరువాయి...**

వ్యాపించాయి. ఫైర్ సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటల్ని అదుపులోకి తెచ్చారు. ఇప్పటివరకూ సుమారు 20 మృతదేహాలను రెస్క్యూ టీమ్ వెలికి తీసినట్లు తెలిపారు. ఇందులో చిన్నారుల మృతదేహాలు కూడా ఉన్నాయని, ఘటన జరగడం చాలా దురదృష్టకరం అన్నారు. రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తున్నారు. యువరాజ్ సింగ్ సోలంకి అనే వ్యక్తికి చెందిన టీఆర్పీ గేమ్ జోన్లో ఘటన జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని సీపీ రాజు భార్గవ తెలిపారు. టీఆర్పీ గేమ్ జోన్లో జరిగిన ఘోర విషాదంపై బీజేపీ ఎమ్మెల్యే దర్శితా షా స్పందించారు. ఈ అగ్నిప్రమాద ఘటన దురదృష్టకరం అన్నారు. నేడు రాజ్కోట్లో చాలా విచారకరమైన ఘటన జరిగింది. అగ్నిప్రమాదంలో చిన్నారులు సైతం ప్రాణాలు కోల్పోవడం తనను కలచివేసిందన్నారు. ఇంత పెద్ద అగ్నిప్రమాదం జరగడం రాజ్కోట్ చరిత్రలో ఇదే మొదటిసారి అని తెలిపారు. రెస్క్యూ టీమ్ వీలైనంత మందిని రక్షించడానికి ప్రయత్నాలు చేసిందన్నారు.



# చార్‌దామ్ యాత్రకు రెట్టింపు సంఖ్యలో యాత్రికులు

## ఇప్పటి వరకు వివిధ కారణాలతో 56మంది మృతి

న్యూఢిల్లీ, మే 25 (ప్రభాత ఉదయం): మేలో ప్రారంభమైన ఉత్తరాఖండ్‌లోని చార్‌ధామ్ యాత్రకు ఈసారి గతంలో కంటే రెట్టింపు సంఖ్యలో పర్యాటకులు సందర్శించారు. ఈ క్రమంలో గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్ ప్రాంతాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో ఈ ఏడాది మృతుల సంఖ్య కూడా పెరిగింది. ఈ యాత్ర ప్రారంభమైన 16 రోజుల్లోనే శుక్రవారం సాయంత్రం నాటికి 56 మంది యాత్రికులు మరణించారు. కేదార్‌నాథ్ ధామ్ యాత్ర మార్గంలో ఇప్పటివరకు గరిష్టంగా 27 మంది యాత్రికులు మరణించారని అక్కడి అధికారులు వెల్లడించారు. చార్‌ధామ్ బద్రీనాథ్, కేదార్నాథ్, గంగోత్రి యమునోత్రి ఎత్తైన హిమాలయ ప్రాంతాలలో ఉన్నాయి. ఇక్కడ చాలా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. దీంతో ఈ ప్రాంతాలకు వెళ్లిన యాత్రికులు ఎక్కువగా గుండెపోటునల మరణించినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ యాత్రలో మృతి చెందిన 56 మందిలో 52 మంది యాత్రికులు గుండె పోటుతో మృతి చెందడం విశేషం. మృతుల్లో ఎక్కువ మంది 60 ఏళ్లు పైబడిన వారేనని అధికారులు చెప్పారు. మరోవైపు యాత్ర మార్గంలో భక్తులకు నిత్యం సూచనలు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. హెల్త్ చెకప్ సమయంలో ఆరోగ్యం బాగోలేని భక్తులను ప్రయాణం చేయవద్దని వైద్యులు కోరుతున్నారు. దీని తర్వాత కూడా ఎవరైనా యాత్రకు వెళితే రాతపూర్వకంగా ఫారం నింపేలా చర్యలు తీసుకుంటున్నారు. కాలినడకన కేదార్‌నాథ్, యమునోత్రి ధామ్‌లను అధిరోహిస్తున్నప్పుడు ఒకటి నుంచి రెండు గంటల తర్వాత ఐదు నుంచి 10 నిమిషాలు విశ్రాంతి తీసుకోవాలని సూచిస్తున్నారు.దీంతోపాటు వెచ్చని బట్టలు, వర్షం నుంచి రక్షణ కోసం రెయిన్ కోట్, గొడుగు, పల్స్ ఆక్సిమీటర్, థర్మామీటర్ వంటివి తెచ్చుకోవాలని సూచించారు. గుండె జబ్బులు, అధిక రక్తపోటు, ఉబ్బసం, మధుమేహంతో బాధపడే యాత్రికులు అవసరమైన మందులు, వైద్యుల నంబర్‌ను అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు.



# 5 నిముషాల ముందు కూడా రిజర్వేషన్

**మొదటి పేజీ తరువాయి...**

కారణాలతో ప్రయాణం రోజునే టికెట్ క్యాన్సిల్ చేసుకొనేవారు చాలా మంది ఉంటారు. అలాంటి సందర్భాల్లో ఖాళీగా ఉన్న టికెట్లను విక్రయించేందుకు రైల్వేశాఖ ఈ సదుపాయాన్ని తీసుకొచ్చింది. ప్రతిట్రైన్ టికెట్ బుకింగ్ కోసం రైల్వేశాఖ రెండు చార్ట్‌లను ప్రిపేర్ చేస్తుంది. ఫస్ట్ ఛార్ట్ అనేది రైలు బయలుదేరడానికి 4 గంటల ముందు ప్రిపేర్ అవుతుంది. రెండో ఛార్ట్ రైలు స్టార్ట్ అవ్వడానికి ముందు రూపొందిస్తారు. గతంలో అరగంట ముందు వరకు మాత్రమే టికెట్ బుకింగ్‌కు అనుమతించేవారు. ఇప్పుడు రైలు బయల్దేరడానికి ఐదు నిమిషాల ముందు వరకు వెసులు బాటు కల్పించారు. కాబట్టి ట్రైన్ స్టార్ట్ అయ్యే ఐదు నిమిషాల ముందు కూడా టికెట్లు అందుబాటులో ఉంటే ఆన్‌లైన్ / ఆఫ్ లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. మొదట సీట్లు ఖాళీ ఉన్నాయా లేదా తెలుసుకోవాలి. దీనికోసం ముందుగా ఐఆర్‌సిటిసి యాప్ ఓపెన్ చేసి ట్రైన్ సింబల్‌పై క్లిక్ చేస్తే , ఛార్ట్, వేకెన్సీ సదుపాయం కనిపిస్తుంది. లేదా నేరుగా ఆన్‌లైన్ ఛార్ట్ వెబ్‌సైట్ లోకి వెళ్లి చెక్ చేయొచ్చు. అక్కడ ట్రైన్ పేరు/ నంబర్ , తేదీ , ఎక్కాల్సిన స్టేషన్ వివరాలు ఎంటర్ చేసి 'గెట్ ట్రయిన్ ఛార్ట్ 'పై క్లిక్ చేయాలి వెంటనే తరగతుల వారీగా అందుబాటులో ఉన్న ఖాళీ సీట్ల వివరాలు కనిపిస్తాయి. సీటు ఉంటే టికెట్ బుక్ చేసుకోవచ్చు. సీటు లేకుంటే సున్నా చూపిస్తుంది. కోచ్ నంబర్ , బెర్త్ , మొత్తం వివరాలు అక్కడే కనిపిస్తాయి. ట్రైన్ ప్రారంభం అయ్యే స్టేషన్లలో ఎక్కేవారికే ఈ ఆప్షన్ ప్రయోజనకరంగా ఉంటుంది.



# తెలంగాణ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు ముగిసిన ప్రచారం

**మొదటి పేజీ తరువాయి...**

ఓటర్లు ఉన్నారు.

### పల్లా ఎమ్మెల్యేగా గెలవడంతో రాజీనామా

2021లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి విజయం సాధించారు. శాసనసభ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్ రెడ్డి గెలుపొందారు. ఆయన తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో పట్టభద్రుల ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ పోరులో మొత్తం 52 మంది అభ్యర్థులు ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఏనుగుల రాకేశ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి తీన్మార్ మల్లన్న, బీజేపీ అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి పోటీ చేస్తున్నారు. సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవాలని బీఆర్ఎస్ కృషి చేస్తుండగా.. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ తమదే పై చేయి కావాలని కాంగ్రెస్ వ్యూహాలు రచించింది.

### తీన్మార్ మల్లన్న కోసం మంత్రుల ప్రచారం

కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతుగా స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి ప్రేమెందర్ రెడ్డ కి మద్దతుగా కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, బీజేపీ స్థానికి ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు ప్రచారం నిర్వహించగా.. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డి తరుపున కేటీఆర్, హరీశ్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, పలువురు ముఖ్యనేతలు ప్రచారం నిర్వహించారు.

### సోమవారం పోలింగ్

ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో సాయంత్రం 4 గంటల నుంచి సోమవారం సాయంత్రం 4 గంటల వరకూ మద్యం దుకాణాలు, బార్లు మూసివేస్తారు. . అగ్ర పార్టీల ముఖ్య నేతలు నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 52 మంది బరిలో ఉన్నారు. ప్రధాన పోటీ బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య జరుగుతుందని భావిస్తున్నారు.



# తెలంగాణలో మళ్లీ పెరిగిన ఎండలు

**మొదటి పేజీ తరువాయి...**

ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఆదివారం పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వివరించింది. గడిచిన 24గంటల్లో వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్ కర్నూల్ జిల్లాల్లో మోస్తరు వర్షాపాతం నమోదైంది. పలు జిల్లాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. ఇక నైరుతి రుతుపవనాలు నైరుతి బంగాళాఖాతంలో మరికొన్ని ప్రాంతాలు, ఆగ్నేయ బంగాళాఖాతంలో మిగతా ప్రాంతాలకు విస్తరించాయని అమరావతి వాతావరణ విభాగం పేర్కొంది. రాబోయే 24గంటల్లో నైరుతి బంగాళాఖాతం, మధ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలు, ఈశాన్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల మీదుగా ముందుకు సాగేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని పేర్కొంది. ఈస్ట్ సెంట్రల్ బంగాళాఖాతంపై ఏర్పడిన తీవ్ర అల్పపీడనం గత ఆరుగంటల్లో గంటకు 17 కిలోమీటర్ల వేగంతో దాదాపు ఉత్తరం వైపుగా కదులుతోందని.. పేర్కొంది. ఉత్తర వైపు కదులుతూ సాయంత్రం నాటికి తూరు మధ్య కదులుతూ ఆదివారం ఉదయం నాటికి తీవ్ర తుఫానుగా మారి అర్ధరాత్రి సాగర్ ద్వీపం, ఖేపుపరా మధ్య బంగ్లాదేశ్, ఆనుకొని పశ్చిమ బెంగాల్ తీరాలను దాటుతుందని పేర్కొంది.



# దేశవ్యాప్తంగా ముగిసిన 6వదశ పోలింగ్

**మొదటి పేజీ తరువాయి...**

నడిచింది. ఇప్పటి వరకు 6 దశల పోలింగ్ కు సంబంధించి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు హెూరాహెూరీగా ప్రచారం నిర్వహించాయి. ఇక మొత్తం ఏడు దశల్లో దేశవ్యాప్తంగా లోక్ సభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మే 25న ఆరవ దశ పోలింగ్ పూర్తి అయింది. చివరి దశ పోలింగ్ కోసం రేపటి నుంచి అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలతో పాటు పలు రాష్ట్రాల ముఖ్య నేతలు ఎన్నికల ప్రచారంలో పాల్గొనున్నారు. ఏడవ దశ పోలింగ్ ప్రక్రియ జూన్ 1న జరగనుంది. మొత్తం దేశంలో 543 పార్లమెంట్ స్థానాలకు గానూ నేటికి 486 స్థానాల్లో పోలింగ్ పూర్తైంది. మిగిలిన 57 స్థానాలకు జూన్ 1న పోలింగ్ జరగనుంది. ఏడోదశ పోలింగ్ అనంతరం జూన్ 4న ఫలితాలు విడుదల అవుతాయి.

# సంగీత కళల ప్రోత్సాహానికే

# దేవీ సంగీత్ ఘర్ కృషి




స్వాతంత్ర్యం వచ్చిన తొలి దినాలలో కోఠి జాంబాగ్ రోడ్డు లో ఏర్పాటు చేసిన సంగీత్ ఘర్



దేవీ సంగీత్ ఘర్ పేరుతో నేటికి కొనసాగుతున్న సంగీత వాయిద్యాల దుకాణం



దేవీ సంగీత్ ఘర్ నిర్వాహకులు సునీల్

### తాము నేర్చుకున్న కళలను పది మందికి అందించాలనే భన్వర్ లాల్ వంశస్థుల కృషి నేటికి కోఠి జాంబాగ్ రోడ్డులో దుకాణం

బుద్వేల్, మే25(ప్రభాత ఉదయం): సంగీతం మనసును ఆహ్లాద పరుస్తుంది.... సంగీతం మానసిక ప్రశాంతతనిస్తుంది.... దుఃఖ సమయంలో ఉన్నప్పుడు సంగీతం నెమ్మదినిస్తుంది.... సంతోషంలో ఉన్న సమయంలో రెట్టింపు ఉత్సాహాన్ని కలగజేస్తుంది. సంగీతానికి అంతటి గొప్ప శక్తి ఉంది. ఆ శక్తే ఓ కళాకారుని ఉత్తేజపరిచి తాను నేర్చుకున్న కళను పదిమందికి నేర్పడంతో పాటు ఆ కళ లను కొనసాగించేలా ఉండడానికి స్వాతంత్రం వచ్చిన తొలి దినాల్లోనే నగరంలో ఓ సంగీత నిలయాన్ని ఏర్పాటు చేసేలా స్ఫూర్తినిచ్చింది. వివరాల్లోకి వెళితే..... నగరంలోని కోఠి జాంబాగ్ కు చెందిన బన్వరీ లాల్ నిజాం కాలంలో తబలా వాయించడంలో ప్రావీణ్యులు. నిజాం కాలంలో హిందు సాంప్రదాయాలను ప్రాధాన్యత ఇవ్వకూడదనే నిబంధన ఉండటంతో భన్వరీ లాల్ ఎలాంటి పేరు ప్రతిష్టలు లేకుండా తన నైపుణ్యాన్ని కొనసాగిస్తూ వచ్చారు. బన్వరీ లాల్ కుమారులు యాదగిరి, జ్ఞానేశ్వర్ , నర్సింగ్ రావులు కూడా తబలా వాయించడంలో నిష్ణాతులు. స్వాతంత్రం వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రానికి 1948 సెప్టెంబర్ 17వ తేదీన తర్వాత జరిగిన మొదటి దీపావళి ఉత్సవాలలో సంగీత కార్యక్రమాలు ప్రజలు పెద్ద ఎత్తున చేసుకోవడం మొదలుపెట్టారు. అప్పటి నుంచి కోఠి జాంబాగ్ ప్రాంతంలో భన్వరీ లాల్ సంగీత్ ఘర్ పేరుతో వివిధ రకాల వాయిద్యాలను విక్రయించడానికి ఓ దుకాణం ఏర్పాటు చేశారు. తాను నేర్చుకున్న కళలను కుమారులకు నేర్పించడం తో పాటు రాబోవు తరాలకు కూడా అందించాలన్నదే ఆయన బలమైన కోరిక. భన్వరీ లాల్ ఏర్పాటు చేసిన ఆ దుకాణాన్ని ఆయన కుమారులు యాదగిరి, జ్ఞానేశ్వర్, నర్సింగ్ రావు లు కొనసాగిస్తూ వచ్చారు.

**నేడు భన్వరీ లాల్ మనుమడు సునీల్ సైతం....**

భన్వరీ లాల్ మనుమడు సునీల్ సైతం జాంబాగ్ లోని దుకాణానికి దేవీ సంగీత్ ఘర్ పేరుతో కొనసాగిస్తున్నారు. బన్వారిలాల్ మనవడైన సునీల్ క్లాసికల్ మ్యూజిక్ వాయిద్యాలు దుకాణం నిర్వహిస్తుండగా, ఆయన ముని మనుమడు కౌశిక్ నేటికి కూడా తబలా వాయించడంలో మంచి ప్రావీణ్యం కొనసాగిస్తున్నారు.



## నేడు గగన్ పహాడ్‌లో విద్యుత్తు లేని ప్రాంతాలు

రాజేంద్రనగర్, మే 25(ప్రభాత ఉదయం) గగన్ పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగల కు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడానికి ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ జుబేరుద్దీన్ తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని శాతం రాయి, మీనాక్షి పేపర్ మిల్, మీనాక్షి పరిశ్రమ పరిసర ప్రాంతాలు, శాతం రాయి విద్యుత్ ఫీడర్ పరిధిలో సాతంరాయి పారిశ్రామిక వాడ, జై భవాని విద్యుత్ ఫీడర్ పరిధిలో జై భవాని పారిశ్రామిక ప్రాంతం, అన్నపూర్ణ మిల్, లియో లామినేట్స్ ప్రాంతాలలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు, గగన్ పహాడ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో జల్పల్లి పారిశ్రామిక ప్రాంతం గగన్ పహాడ్ పారిశ్రామిక ప్రాంతం డ్రీమ్ అవెన్యూ డ్రీమ్ మోనార్క్ గోల్డ్ డ్రాప్ విద్యుత్ ఫిల్టర్ పరిధిలో లోహియా లేన్, చర్చి లైన్, వెంకటేశ్వర కాలనీ, గోల్డ్ డ్రాప్ లేని, మీనా కెమికల్స్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మీనా కెమికల్ పరిశ్రమ ప్రాంతం ,సెలబ్రేషన్ ఫంక్షన్, ప్రాంతాలలో మధ్యాహ్నం ఒకటిన్నర నుండి మూడు గంటల వరకు, మెట్రో మాల్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని గగన్ పహాడ్ విలేజ్, మెట్రో మాల్ ప్రాంతం, ఆంధ్ర లిక్కర్, గోశాల, గ్గన్ పహాడ్ పారిశ్రామిక ప్రాంతం, కరాచీ బేకరీ, పిలికాన్ రబ్బర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నము3:30 నుండి సాయంత్రం ఐదు వరకు,గంగోత్రి లీడర్ పరిధిలో ఉదయం11 నుండి 12:30 వరకు, రవి ఫుడ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 15:30 నుండి 17:00 వరకువిద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని కోరారు.

**కాటేదాన్‌లో...**

కాటేదా న్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చెట్ల కొమ్మలను తొలగించడానికి ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కాటేదాన్ పారిశ్రామిక వాడ సాయిబాబా నగర్ మధ్యాహ్నం రెండు నుండి సాయంత్రం ఐదు గంటల వరకు కాటేదాన్ పారిశ్రామిక వాడ నేతాజీ నగర్ శ్రీరాంనగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు



బీచుపల్లి వద్ద గల విజయవర్ధిని ఆయిల్ మిల్ సందర్శించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి చిన్నారెడ్డి

## 150 కోట్లతో ఆత్యాధునిక యంత్రాలతో విజయవర్తిని ఆయిల్ మిల్ పునరుద్ధరణ

### రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి త్వరలో విజయ వర్ధిని ఆయిల్ మిల్ ప్రారంభోత్సవం

ఎర్రవల్లి,మే25(ప్రభాత ఉదయం)రైతుల చిరకాల వాంఛ అయినటువంటి విజయవర్ధిని ఆయిల్ మిల్ ను త్వరలోనే తిరిగి ప్రారంభిస్తామని రాష్ట్ర ప్రణాళిక సంఘ ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి అన్నారు. శనివారం అలంపూర్ నియోజకవర్గం లోని ఎర్రవల్లి మండలలో బీచుపల్లి దగ్గర ఉన్న విజయవర్ధిని ఆయిల్ మిల్లును రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష అయిన విజయవర్ధిని ఆయిల్ మిల్ లో ఉన్నా పురాతన సామాగ్రిని తొలగించి అత్యధి క అత్యాధునికమైన సాంకేతిక పరిజ్ఞానం కలిగినటువంటి యంత్రాలను 150 కోట్ల రూపాయలతో కొనుగోలు చేసేందుకు నిధులు సైతం మంజూరు చేయడం జరిగిందని డాక్టర్ చిన్నారెడ్డి అన్నారు.ఈ ఆయిల్ యొక్క సామర్థ్యము పదివేల ఎకరాలలో రైతులు పండించినటువంటి పంటను ఆయిల్ గా మార్చే సామర్థ్యం గలదిగా చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. అయితే నడిగడ్డ ప్రాంతంలో దాదాపుగా 6000 ఎకరాలలో పంట విస్తీర్ణం చేయడం జరిగిందని, సమీప ప్రాంతాలైన నగర్ కర్నూల్, వనపర్తి తదితర ప్రాంతాల లో రైతుల పండించిన పామాయిల్ గెలల ను ఈ ఆయిల్ మిల్క్ తరలించే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. నాటి మాజీ మంత్రి సమరసింహారెడ్డి ఆకాంక్ష మేరకు నడిగడ్డ ప్రాంతంలో ఆయిల్ మిల్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు రావడం నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయిల్ మిల్లు ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కు తుందని అన్నారు. కొన్ని అనివార్య కారణాలవల్ల ఆయిల్ మిల్లు మూతపడడం జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష మేరకు అతి త్వరలో పునర్ నిర్మాణం చేసి ఉపయోగములోకి కు తీసుకొస్తామని అన్నారు. ఈ ఫామ్ ఆయిల్ పంటల దిగుబడి ద్వారా ఒక రైతు సంవత్సరానికి లక్షల రూపాయలలో దిగుబడి తీయచ్చు అన్నారు.ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి వెంట పెబ్బేరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బిచ్చారెడ్డి, శ్రీరంగాపూర్ మండలం జెడ్పిటిసి రాజేంద్రప్రసాద్.కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయ వర్ధన్ రెడ్డి. తదితరులు ఉన్నారు.




కేంద్ర మంత్రి అనురాగ్ తో కలిసి హిమాచల్ ప్రదేశ్‌లో ప్రచారం చేస్తున్న బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి

## హిమాచల్ ప్రదేశ్‌లో బిజెపికి ప్రజలు భారీ మెజారిటీ

### బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి

రాజేంద్రనగర్, మే 25(ప్రభాత ఉదయం) బిజెపి మక్తల్ అసెంబ్లీ ప్రబారి బొక్క బాల్ రెడ్డి హిమాచల్ ప్రదేశ్ లోని నాదన్ జిల్లా పూర్ లో కేంద్ర అనురాగ్ సింగ్ ఠాకూర్ తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారం లో ఎక్కడికి వెళ్లినా అనురాగ్ సింగ్ ఠాకూర్ అమీర్పూర్ లో బాగా అభివృద్ధి చేశా రని విద్య వైద్యం, రోడ్లు తాగునీరు కోసం నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అభివృద్ధిని చూసి బిజెపికి ఓటు వేయటానికి ఇక ప్రజలు మొగ్గు చూపుతున్నారు . నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలు , సబ్సిడీలు ప్రతి పౌరునికి అందే విధంగా అనురాగ్ సింగ్ ఠాకూర్ కేంద్ర మంత్రి ఏర్పాటు చేశారు . ఈ ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే ఉత్తరాఖండ్ వినోద్ కాందారి, బిజెపి నాయకులు బద్దం మహిపాల్ రెడ్డి, రంజిత్, విష్ణు, నాదాన్ జిల్లా అధ్యక్షులు, సర్పంచులు పాల్గొన్నారు.

## చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న మధ్యప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ దంపతులు

చార్మినార్, మే25(ప్రభాత ఉదయం) పాతబస్తీ లోని చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని మధ్యప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్,సీమా యాదవ్ దంపతులు దర్శించుకున్నారు. శని వారం మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ , భార్య సీమా యాదవ్ లతో కలిసి భాగ్యలక్ష్మి ఆశీస్సులు తీసుకున్నారు. సందర్భంగా భాగ్యలక్ష్మి ఆలయ ట్రస్ట్ శశికళ సీఎం మోహన్ యాదవ్ దంపతులకు జ్ఞాపికను అందజేశారు.



మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న భాగ్యలక్ష్మి ఆలయ ట్రస్ట్ శశికళ




విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం ద అందజేస్తున్న సిపిఎం నాయకులు

## విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కరించాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 25(ప్రభాత ఉదయం)విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న రెగ్యులర్, ఆర్టిజన్స్ , పిస్ రేట్, సెక్యూరిటీ గార్డ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో డిఈ కార్యాలయంలో సబ్ ఇంజనీర్ మహేష్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏ. వెంకట స్వామి, వివి నరసింహాలు మాట్లాడుతూ... విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న రెగ్యులర్ ఆర్టిసన్, అన్ మెన్, పీస్ రేట్ , సెక్యూరిటీ గార్డ్ కార్మికుల సమస్యలపై యూనియన్ గా గత ఫిబ్రవరి 26న యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చామని కానీ ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదని ఇప్పటికైనా కార్మిక వర్గ సమస్యల పట్ల నిర్లక్ష్యం వీడి సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ కార్మికులందరికీ విద్యా అర్హత ను బట్టి జేఎల్ఎం జేపిఏ జూనియర్ అసిస్టెంట్, ఆఫీసు సభార్డినేట్ , సబ్ ఇంజనీర్ తదితర రెగ్యులర్ పోస్టులకు కన్వర్షన్ ఇవ్వాలని, అన్ మ్యాన్ వ్యవస్థను రద్దు చేసి అట్టి కార్మికులను సంస్థలో విలీనం చేసుకుని రెగ్యులరైజ్ చేయాలని అన్నారు. ఒకే సంస్థ ఒకే సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు, పీసీ రేట్ కార్మికులకు సంబంధించి వారి యొక్క సేవలను గుర్తించి సంస్థలో విలీనం చేసుకుని ఆర్టీ సన్స్ గా గుర్తించాలని, అంతలోపు కనీస వేతనం జీవో అమలు చేసి కనీస వేతనాలు ఈఎస్ఐ పిఎఫ్ మరియు మెడికల్ క్రెడిట్ కార్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించి విద్యుత్ సంస్థలో ఉద్యోగులకు ఈపిఎఫ్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని 1/07/2023 డి ఎ ఏరియర్స్ మరియు 1/01/2024 డి ఏ వెంటనే విడుదల చేయాలని, కారుణ్య నియామకాల్లో పాత నిబంధనల ప్రకారం విద్యా అర్హత కు తగ్గ ఉద్యోగం ఇవ్వాలని అన్నారు. 2022 పి ఆర్ సి నీ పునర్ సమీక్షించాలని, ఉద్యోగులందరికీ ఆర్టీసీ తరహాలో కోటి రూపాయల టర్మ్ ఇన్సూరెన్స్ చేయించాల ని డిమాండ్ చేశారు. విద్యుత్ కార్మికుల సమస్యలను కాలయాపన చేయకుండా, సకాలంలో పరిష్కరించకపోతే సిఐటియు ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ పాల్గొన్నారు.

# కాటేదాన్ శ్రీ వెంకటేశ్వర స్వామీ దేవాలయంలో అన్న దానం



కాటేదాన్ టీఎన్జీవోస్ కాలనీ లోని శ్రీ వెంకటేశ్వర స్వామీ దేవాలయం



కొలువుదీరిన శ్రీ వెంకటేశ్వర స్వామీ



అన్నదానంలో పాల్గొన్న భక్తులు



వార్షికోత్సవాలకు సన్నాహాలు



పూజలలో పాల్గొన్న భక్తులు

### ఈ నెల 26 నుంచి 31 వరకు 7వ వార్షిక బ్రహ్మోత్సవాలు

బుద్వేల్, మే25(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ టీఎన్జీవోస్ కాలనీలో గల శ్రీ వెంకటేశ్వర స్వామీ దేవాలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు . దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమం జరిగింది. వందల సంఖ్యలో భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. నేటి నుంచి ఆరు రోజుల పాటు 7వ వార్షిక బ్రహ్మోత్సవాలు : కాటేదాన్ వెంకన్న గుట్టపై వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామీ దేవాలయం లో ఈనెల 26వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 7వ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించడానికి దేవాలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 26న ఉదయం ఆరాధన, సేవా కాలం, గోష్టి బాల భోగం లాంటి పూజా కార్యక్రమాలు ప్రారంభమై 31వ తేదీ వరకు ప్రతిరోజు శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

**జూన్ 1వ తేదీన హనుమజ్జయంతి :**

జూన్ 1వ తేదీన హనుమజ్జయంతి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 5 గంటలకు పంచామృత అభిషేకం , 7 గంటలకు విశేష అర్చనలు, సాయంత్రం నాలుగున్నర గంటలకు తమలపాకులతో అర్చనలు, 108 అరటి పండ్లతో అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ వెంకటేశ్వర స్వామీ వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

# కౌన్ బనేగా కరోడ్‌పతి అర్హత ప్రోగ్రాంకి ఎన్నికైన నడిగడ్డ వాసి





గద్వాల జిల్లా ప్రతినిధి, మే 25(ప్రభాత ఉదయం)బాలీవుడ్ దిగ్గజ నటుడు అమితాబ్ బచ్చన్ హెూస్ట్ గా వ్యవహరిస్తున్న కౌన్ బనేగా కరోడ్‌పతి ప్రోగ్రామ్ షో పాల్గొనేందుకు నిర్వహించు అర్హత ప్రోగ్రామ్ కు జోగులాంబ గద్వాల వాసి ఆటో మక్బూల్ సెలెక్ట్ అయ్యారు. గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన ఆటో మక్బూల్ వృతిరీత్యా ఆటో డ్రైవర్. డ్రైవర్ గా ఉంటూ కుటుంబాని పోషించుకుంటూ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పరితపించి రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యమకారుడు. అంతే కాకుండా గద్వాల జిల్లా సాధనకై జిల్లా ఉద్యమంలో ప్రాణాలకు తెగించి సెల్ టవర్ ఎక్కి జిల్లా సాధనలో తన వంతు పాత్ర పోషించారు. జిల్లా ఉద్యమంలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకొని అందరి అభిమానాలు పొందాడు. ఆటో డ్రైవర్ గా తన కుటుంబ ఒడిదుడుకులను ఎదుర్కొంటూ దేశంలోని కోట్లాదిమంది పాల్గొనే కౌన్ బనేగా కరోడ్పతి ప్రోగ్రాం లో స్థానం సంపాదించుటకు ఎన్నో సంవత్సరాలుగా ప్రయత్నించాడు. కే బి సి ప్రోగ్రాం లో హాట్ సీట్ లో స్థానం సాధించడమే లక్ష్యంగా పరితపించి, తన కలను సాకారం చేసుకోవడానికి ఈనెల 26న బాంబే కాండివెలి వెస్ట్ పవార్ పబ్లిక్ స్కూల్ లో జీకే గ్రౌండ్ ఎడిషన్ లో నిర్వహించు ఎల్జిబిల్ షోలు పాల్గొనున్నారు. ఈ సందర్భంగా తన మేధాసంపత్తితో కే బి సి షోకు అర్హత పొంది, కే బి సి కాంటెస్టో కూడ విజయం సాధించాలని నడిగడ్డ ప్రజలు ఆకాంక్షించారు.



## పోలీసు అధికారులతో న్యాయమూర్తుల సమావేశం

గద్వాల,మే25(ప్రభాత ఉదయం) వచ్చే నెల 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయమూర్తి కె.కుష అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో నిర్వహించిన పోలీసు అధికారుల సమావేశంలో జిల్లా న్యాయమూర్తి మాట్లాడారు. రాజీ కాదగిన క్రిమినల్ కేసులలో ఇరువర్గాల వారిని రాజీ కుదిర్చి ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని ఆయన పోలీసులను కోరారు. రాజీమార్గమే రాజమార్గమని, కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి డబ్బులు, సమయం వృధా కాకుండా రాజీ ద్వారా కేసులు పరిష్కంచేందుకు సహకరించాలన్నారు. ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించి తెలంగాణ రాష్ట్రంలోనే ప్రథమ స్థానం నిలిపేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా న్యాయమూర్తి కుష కోరారు. ఈ సమావేశంలో అదనపు ప్రథమ శ్రేణి న్యాయ మూర్తి ఉదయ్ నాయక్, గద్వాల డిఎస్పీ సత్యనారాయణ, అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ త్రిపాఠి, ఎపిపిలు సృజన, భవాని, సిఐ భీంకుమార్, ఆయా స్టేషన్ ల ఎస్ఐలు కానిస్టేబుల్స్, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజాధనంతో పార్కులు నిర్మించి నిర్వహణ మరిచిన అధికారులు

**అసాంఘిక కేంద్రాలుగా కే పీ హెచ్ బీ కాలనీ పార్కులు**

**అసాంఘిక కార్యకలాపాలు చేపడుతున్న వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలి...**

**పార్కుల నిర్వహణ జిహెచ్ఎంసి చేపట్టాలి:శేరి సతీష్ రెడ్డి...**

కూకట్‌పల్లి, మే 25 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలో పలు పార్కులను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు బృందం శనివారం పార్కులు సందర్శించి పరిశీలించారు. పార్కుల మెయింటెనెన్స్, పార్కుల్లో ఉన్న సమస్యలను గుర్తించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజా అవసరాల కోసం పేరుతో హౌసింగ్ బోర్డ్ కాలనీలో అవసరాలు లేనప్పటికీ ఖాళీ స్థలాలను కమిషన్ల కోసం పార్కులను నిర్మించారని అన్నారు. నిర్మించిన పార్కుల నిర్వహణ జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో జరగాలని అయితే ఇక్కడ మాత్రం బి ఆర్ ఎస్ నాయకులు పార్కులో తిష్ట వేసి సొంత జాగరుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. అంతేగాక కేపీహెచ్బీ ఎలిసి ఫ్లాట్స్ ప్రాంతంలో గల పార్కుల్లో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని వీటిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. అభివృద్ధి అంటే ప్రజాధనంతో నిర్మించి పట్టించుకోకుండా ఉండడం కాదని, గత ప్రభుత్వం హయంలో పార్క్ లో డెవలప్మెంట్ కోసం అని కోట్ల రూపాయలు నిధులు వేచించి టెండర్లు పిలిచి కమిషన్ల కోసం పనులు చేపట్టి నిర్వహణ బాధ్యత మరిచిపోయారని వెంటనే జిహెచ్ఎంసి అధికారులు పార్కులను పరిశీలించి ప్రజా అవసరాలకు వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఈ విషయమై తాము జిహెచ్ఎంసి అధికారులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని శేరి సతీష్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కెపిహెచ్బి డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ రాజు, మహిళా అధ్యక్షురాలు పొన్నం రజిత గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అరవింద్ రెడ్డి, ఫణీంద్ర కుమార్, మేకల మేకలు, నాగమల్లేశ్వరరావు, బాబ్జి, నితీష్ కుమార్ గౌడ్, కిరణ్, సాయి తేజ గౌడ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



## హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయాలి: మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి, మే 25 (ప్రభాత ఉదయం) జూన్ ఒకటవ తేదీన శ్రీ హనుమాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకుని కూకట్ పల్లి స్వఛభారత్ అభియాన్ ఆధ్వర్యంలో చేపట్టనున్న శ్రీ వీర హనుమాన్ ఏక్తా యాత్రకు సంబంధించిన ముందస్తు కార్యాచరణ సమావేశం శనివారం కూకట్ పల్లి అసెంబ్లీ పరిధిలోని 115వ డివిజన్-బాలాజీ నగర్ కాలనీ శ్రీ సంజీవినీ హనుమాన్ దేవాలయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి స్వఛభారత్ అభియాన్ వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరం కాంతారావు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ర్యాలీకి సంబంధించిన ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ కూకట్ పల్లి స్వఛభారత్ అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హిందూ ఏక్తా ర్యాలీలో ప్రతిఒక్కరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వఛభారత్ అభియాన్ కమిటీ సభ్యులు, సంజీవని హనుమాన్ దేవాలయ సభ్యులు, హిందూ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## రణధీర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమంలో పళ్ళ పంపిణీ



శంషాబాద్, మే 25( ప్రభాత ఉదయం.) యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిన్న గోల్కొండ సింగిల్ విండో మాజీ చైర్మన్ గుర్రం రణధీర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ నాయకులు రణధీర్ రెడ్డి అభిమానులు వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. శంషాబాద్ మండలం లోని పెద్ద తూప్రా గ్రామంలో ఉన్న వృద్ధాశ్రమంలో వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి వారికి పళ్ళను పంపిణీ చేశారు. రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకుడు రణధీర్ రెడ్డి మరిన్ని పుట్టినరోజులను స్నేహితులు బంధుమిత్రుల మధ్యన సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు యూత్ కాంగ్రెస్ నాయకులు నసీరుద్దీన్. గుంటి ప్రవీణ్.( మిట్టు ). శుభోద్ స్వరాజ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్సన్. సంజీవరెడ్డి. నసిరుద్దీన్. రఘునందన్. ప్రశాంత్. శ్రీనివాస్ యాదవ్. గణేష్ నాయక్. చిరంజీవి గౌడ్. ఖాజా పాషా తదితరులు పాల్గొన్నారు.



## రంజిత్ రెడ్డి గెలుపు కోసం ప్రార్థనలు చేయండి: పసియోద్దీన్

శంషాబాద్, మే 25( ప్రభాత ఉదయం) చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి రెండవసారి విజయం సాధించే విధంగా ప్రజలందరూ ప్రార్థన చేయాలని రంగారెడ్డి జిల్ల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మహమ్మద్ ఫసియుద్దీన్ విజ్ఞప్తి చేశారు. గత ఐదు సంవత్సరాలుగా చేవెళ్ల పార్లమెంటు సభ్యుడిగా ఉన్న రంజిత్ రెడ్డి నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. రెండవ సారి సెక్యులర్ పార్టీ అయినా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆయన భారీ మెజార్టీతో విజయం సాధించాలని నియోజకవర్గంలోని ప్రజలందరూ పిలుపునిచ్చారు. రంజిత్ రెడ్డి ఎప్పటికప్పుడు ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ వారికి ఏ సమస్య ఉన్నా నేనున్నాను అంటూ అపన్న హస్తము అందించాడని అసియుద్దీన్ తెలిపారు. ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన రంజిత్ రెడ్డి మరోసారి విజయం సాధిస్తే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి సాధిస్తుందని ఆయన ఆశ భావం వ్యక్తం చేశారు. ఆయన గెలుపు కోసం ప్రజలందరూ ప్రార్థించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ సభ్యులు, మా గౌరవనీయమైన పార్లమెంటు అభ్యర్థి శ్రీ జి. రంజిత్ రెడ్డికి మీ ప్రార్థనలు మరియు మద్దతును వినమ్రంగా అభ్యర్థిస్తున్నాము. కీలకమైన ఎన్నికలు సమీపిస్తున్న వేళ మీ ఆశీస్సులు, ఆదరాభిమానాలే మమ్మల్ని విజయం వైపు నడిపిస్తాయి.

# రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి

## జిల్లా కలెక్టర్ బి ఎస్ సంతోష్



**రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్ బి.ఎస్ సంతోష్**

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 25(ప్రభాత ఉదయం)రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి తమ పొలంలో నాటినప్పుడే మంచి పంట దిగుబడులు వస్తాయని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు. శనివారం గద్వాల మండలం చెనుగోనుపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తనాల కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ గుర్తింపు పొందిన ఆధీకృత డీలర్ల దగ్గరే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. విడిగా ఉన్న సంచుల్లోని విత్తనాలను కొనుగోలు చేయరాదని, సంబంధిత కంపెనీ లేబుల్ ఉన్న ప్యాకెట్లను కొనాలని తెలిపారు. కొనుగోలు చేసిన విత్తనాల ఖాళీ ప్యాకెట్లను, బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకుంటే ఒకవేళ నకిలీ విత్తనాల కారణంగా దిగుబడి రానప్పుడు సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. నకిలీ విత్తనాలు అమ్మే వారి గురించి రైతులు, ఇతర పౌరులు ఎవరైనా సరే సమాచారం ఇస్తే వ్యవసాయ శాఖ, టాస్క్ ఫోర్స్ యంత్రాంగం సహాయంతో వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. నకిలీ విత్తనాలు నాటితే పంట కోసం నాలుగైదు నెలలు పొలంలో కష్టపడి ప్రయోజనం ఉండదన్నారు. అందుకే ముందు జాగ్రత్తగా విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వ్యవసాయ అధికారులు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అవగాహన కార్యక్రమానికి వచ్చిన రైతులందరూ తమ గ్రామంలోని మిగతా రైతులకు కూడా ఇక్కడ తెలియజేసిన అంశాలు చెప్పి అందరూ మంచి పంటలు సాగు చేసుకునేలా సహకరించాలని కోరారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో రైతులకు విత్తనాల కొనుగోలు, ఇతర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు నాయక్, ఏ డి ఓ సంగీతలక్ష్మి, ఏవో ప్రతాప్ కుమార్, ఏఈఓ లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## విత్తన కొనుగోలులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

**ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి**



గద్వాల జిల్లా ప్రతినిధి, మే 25(ప్రభాత ఉదయం) రైతలు కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సూచనలు చేశారు.రైతులు నాణ్యమైన విత్తనాలుబి కొనుగోలు చేసి తమ పొలంలో నాటినప్పుడే మంచి పంట దిగుబడులు వస్తాయని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. విత్తనాల కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై లిఎమ్మెల్సీ లిమాట్లాడుతూ... వ్యవసాయ శాఖ గుర్తింపు పొందిన ఆధీకృత డీలర్ల దగ్గరే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. విడిగా ఉన్న సంచుల్లోని విత్తనాలను కొనుగోలు చేయరాదని, సంబంధిత కంపెనీ కొనుగోలు చేసిన విత్తనాల ఖాళీ ప్యాకెట్లను, బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకుంటే ఒకవేళ నకిలీ విత్తనాల కారణంగా దిగుబడి రానప్పుడు సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. రైతన్న లకి వివరించారు నకిలీ విత్తనాలు అమ్మే వారి గురించి రైతులు, ఇతర పౌరులు ఎవరైనా సరే సమాచారం ఇస్తే వ్యవసాయ శాఖ , టాస్క్ ఫోర్స్ యంత్రాంగం సహాయంతో వారిపై చర్యలు తీసుకోవచ్చని రైతన్నలకు తెలియజేశారు. నకిలీ విత్తనాలు నాటితే పంట కోసం రైతన్నలకు రైతులందరూ తమ గ్రామంలోని మిగతా రైతులకు కూడా ఇక్కడ తెలియజేసిన అంశాలు చెప్పి అందరూ మంచి పంటలు సాగు చేసుకునేలా ఒకరికి ఒకరు సహకరించాలని కోరారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో రైతులకు విత్తనాల కొనుగోలు, ఇతర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలియజేశారు

# మహిళా మెడికల్ ఆఫీసర్లకు లైంగిక వేధింపులు



## కామారెడ్డి డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మణ్‌సింగ్‌పై వేటు

కామారెడ్డి, మే 25 (ప్రభాత ఉదయం): లైంగిక వేధింపుల కేసులో కామారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మణ్‌సింగ్‌పై సస్పెన్షన్ వేటుపడింది. మహిళా మెడికల్ ఆఫీసర్లను లైంగికంగా వేధించినట్లు తేలడంతో ఆయన్ను సస్పెండ్ చేస్తూ వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వైద్యాధికారి తమతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, లైంగికంగా వేధిస్తున్నాడని కలెక్టర్, ఎస్పీతో పాటు వైద్యశాఖ ఉన్నతాధికారుల కు ఇటీవల 20 మంది మహిళా వైద్యాధికారులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన వైద్యశాఖ విచారణకు కూడా ఆదేశించింది. ఈ క్రమంలో రాష్ట్ర వైద్యాధికారి అమర్ సింగ్ నాయక్ బుధవారం నాడు కామారెడ్డి డీఎంహెచ్‌వో కార్యాలయానికి వచ్చి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా తమను డీఎంహెచ్‌వో ఏ విధంగా ఇబ్బంది పెట్టారన్న విషయాన్ని మహిళా ఉద్యోగులు ఆయనకు వివరించారు. దీంతో లక్ష్మణ్‌సింగ్‌పై వివిధ సెక్షన్ల కింద మొత్తం ఏడు కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే మహిళా మెడికల్ ఆఫీసర్లను లక్ష్మణ్ సింగ్ వేధిస్తున్నాడని తేలడంతో ఆయన్ను సస్పెండ్ చేశారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.